ప్రత్యేక పాలనలో ప్రజల అవస్థలు

- పారిశుద్ధ్యం లోపించి కంపుకొడుతున్న వీధులు
- తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు
- వీధి లైట్లు వెలగక అంధకారంలో గ్రామాలు


యల్లప్పకుంట తండాలో చెత్తాచెదారంతో నిండిన మురుగు కాలువ


అనిరెడ్డిగూడెంలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పెన్‌పహాడ్‌ : గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలావరకు గ్రామాల్లో ఏ వీధిలో చూసినా చెత్త చెదారం పేరుకపోతోంది. వీధిలైట్లు వెలగడం లేదు. తాగునీరు సరిగా రావడం లేదు. సర్పంచ్‌లు ఉన్న సమయంలో ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కారమయ్యేదని, ఇప్పుడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. వీధుల్లో ఉన్న చెత్తను కనీసం నెలకోసారైనా తొలగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని ప్రత్యేకాధికారులు..

ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన ప్రత్యేకాధికారులు గ్రామాల్లోకి రావడంలేదని పలువురు అంటున్నారు. ప్రత్యేకాధికారులకు పంచాయతీ విధులతోపాటు పలు రకాల విధులు ఉండడంతో వారు గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని తెలుస్తోంది. దీంతో ఆయా పంచాయతీల పాలన కుంటుపడి ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. కనీసం మురుగు కాల్వల్లో పేరుకపోయిన చెత్తను తొలగించే నాథుడే కరువయ్యారు.

దోమలతో ఇబ్బంది

వానాకాలం కావడంతో దోమలు మరింతగా వ్యాప్తి చెందుతున్నాయి. మురుగు కాల్వల్లో చెత్త పేరుకపోయి నీరు సాఫీగా వెళ్లడం లేదు. మురుగు నీటి కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమలు విజృంభిస్తుండటంతో జ్వరాల బారిన పడుతున్నాం. గ్రామాల్లో నెలకోసారైనా మురుగు కాలువలను శుభ్రం చేయించాలి.

– మంగమ్మ, అనిరెడ్డిగూడెం

సమస్యలు పరిష్కరిస్తాం



పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తాం. ఇప్పటికే కార్యదర్శులతో పాటు సంబంధిత ప్రత్యేక అధికారులను అప్రమత్తం చేశాం. ఎన్ని పనులున్నా వారికి కేటాయించిన గ్రామాల్లో పాలనపై దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


ర్యాలీ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్‌ అధికారులు

సూర్యాపేట : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కెనరా బ్యాంకు ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్‌, కార్యదర్శి సట్టు రామకృష్ణ అన్నారు. కెనరా బ్యాంక్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ జనరల్‌ సెక్రటరీ రవికుమార్‌, సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ లింగారెడ్డిల ఆదేశాల మేరకు డీజీఎస్‌ రవి కెలోతు, ఆర్‌ఎస్‌ విక్రమ్‌రాజ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జనగామ క్రాస్‌ రోడ్డులోని రాజానాయక్‌ తండా నుంచి గాంధీనగర్‌ తండా, గాంధీనగర్‌ వరకు సీడ్‌ బాల్స్‌ను వదిలారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం తప్పనిసరి అన్నారు. అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం ఫణీంద్రకుమార్‌, సీఎం సర్వాణన్‌, ఎస్‌ఎం వెంకటరమణ, మేనేజర్‌ నిరంజన్‌, వెంగల్‌రావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

4న ధర్మ సమాజ్‌ పార్టీ శిక్షణ తరగతులు


నాగారంలో శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

నాగారం : సూర్యాపేటలో ఈ నెల 4న జరిగే ధర్మ సమాజ్‌ పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్‌ పార్టీ(డీఎస్పీ) మండల కన్వీనర్‌ చిప్పలపల్లి నాగార్జున మహారాజ్‌ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్‌ పార్టీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. ఈ నెల 10 నుంచి డీఎస్పీ పార్టీ గ్రామ, మండల కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ జిల్లా నాయకులు విజయరామరాజు, నిరంజన్‌, శ్రీనివాస్‌, వీరయ్య, బన్నీ, అర్జున్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్‌ మ్యాక్సీ విజన్‌ లేజర్‌ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు, జర్నలిస్టులు, ఆరోగ్యశ్రీ కార్డుదారులు తమ హెల్త్‌కార్డులను వెంట తెచ్చుకోవాలని కోరారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌కు సన్మానం


పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌ మల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు

అర్వపల్లి : కాసర్లపహాడ్‌ గ్రామ పాలఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికైన కాంగ్రెస్‌ నాయకుడు మాచర్ల మల్లయ్యను ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్‌ అధ్యక్షుడు బొల్లం లింగరాజు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నల్లగుంట్ల రవి, సీనియర్‌ నాయకుడు నల్లగుంట్ల శ్రీనివాస్‌, వేముల రమేష్‌, కూరాకుల యుగంధర్‌, ఎస్‌కె. అజీం, మచ్చ నాగార్జున, జిల్లా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌ ముట్టడిని విజయవంతం చేయాలి

నూతనకల్‌ : నీట్‌ పేపర్‌ లీకేజీకి పాల్పడిన దోషులను శిక్షించాలని కోరుతూ జూలై 1న నిర్వహించే రాజ్‌భవన్‌ ముట్టడిని విజయవంతం చేయాలని పీవైఎల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మున్నా అశోక్‌ యాదవ్‌ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. పరీక్ష పత్రాల లీకేజీ పట్ల కనీసం స్పందించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. విద్యార్థులకు జరిగిన అన్యాయంపై బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీట్‌ పేపర్‌ లీకేజీ సూత్రదారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్‌ నాయకులు పెద్దింటి అశోక్‌ రెడ్డి, ముండ్ల మల్లయ్య, బాణాల భీమ్‌రెడ్డి, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నాగారం : నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్తులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆకుల బుచ్చిబాబు, యారాల ఇంద్రాసేనారెడ్డి, యారాల రాంరెడ్డి, చొల్లేటి శ్రీనివాసచారి, బాణాల నారాయణ, తెల్సూరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు హెచ్‌ఎంకు ఘన సన్మానం


సన్మానోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాలునాయక్‌

అర్వపల్లి : కుంచమర్తి గ్రామ యూపీఎస్‌ ప్రధానోపాధ్యాయురాలు కొమ్ము రత్నకుమారి ఉద్యోగ విరమణ సన్మాన సభను ఆదివారం సూర్యాపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలునాయక్‌ మాట్లాడారు. రత్నకుమారి ఉపాధ్యాయురాలిగా విద్యాభివృద్ధికి ఎంతో కృషిచేశారని అన్నారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకి శీనయ్య, నోముల వెంకటేశ్వర్లు, వర్దెల్లి కృష్ణయ్య, సయ్యద్‌, బాలాజీ, కె.నర్సయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.యల్లయ్య, వి.సైదులు, టీపీటీఎఫ్‌ మండల అధ్యక్షుడు దబ్బేటి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సూర్యాపేటటౌన్‌ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సూర్యాపేటటౌన్‌ : చదువుతోనే పేదరికం దూరమవుతుందని హైదరాబాద్‌ డీఎస్పీ మాదాసు వీరయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. చదువుకున్న కళాశాల కోసం పూర్వవిద్యార్థులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కర్నాటి కిషన్‌, నర్సింహమూర్తి, రఘువరన్‌, సుంకరబోయిన వెంకన్న, గిరిబాబు, శ్రీనివాస్‌, పవన్‌కుమార్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌, ఎస్‌.రవి, జానిమియా, భిక్షం, ప్రదీప్‌, ఖలీల్‌, గోవిందరావు, సునీత పాల్గొన్నారు.

నాగారం : పసునూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 1989–90 టెన్త్‌ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు బోధించిన గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, రమేష్‌, రాంరెడ్డి, పూర్వ విద్యార్థులు అబ్బిమల్ల సురేందర్‌, కీర్తి శ్రీనివాస్‌, పాదిల రమేష్‌, కంచరి విజయ్‌, శ్రీనివాస్‌, మేఘ్యానాయక్‌, ఎస్‌.మల్లేష్‌, సోమలింగం, సుజాత, గీతారాణి, గంగమ్మ, శోభ, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.


నాగారం : పసునూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎమ్మెల్యే మందుల సామేల్‌


నూతనకల్‌ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్‌


మద్దిరాల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సామేల్‌


నూతనకల్‌ : ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌


బండరామారంలో మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌

నూతనకల్‌ : గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. ఆదివారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారుల నుంచి సమాచారం సేకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులకు సరైన అవగాహన లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఆర్‌అండ్‌బీ, పీఆర్‌ పరిధిలోని రోడ్ల పరిస్థితులపై వెంటనే తగిన సమాచారం అందించాలని పీఆర్‌ఏఈ లావణ్యను ఆదేశించారు. మండల కేంద్రం నుంచి లింగంపల్లి వరకు నిర్మించే రహదారి కంకరకే పరిమితి కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టెండర్‌ ఖరారు కావడంతో పని మొదలు పెట్టిన వివరాలను అందించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూమాత పథకంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. భూమాత పథకం వివరాలను ఫ్లెక్సీల రూపంలో రూపొందించి కార్యాలయాల ముందు ప్రదర్శించాలని తహసీల్దార్‌ ఎం. శ్రీనివాసరావును ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం చిన్నారులకు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మూమెంట్‌ రిజిస్టర్‌ మెయింటేన్‌ చేయాలని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలపై మండల విద్యాధికారిని సమాచారం అడగగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్‌ శాఖ ఏఈ సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరం ఉన్న వ్యక్తులు ప్రభుత్వ అనుమతితో ఇసుకను తరలించాలని ఆయన సూచించారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారం అందించాలని, సమాచారం ఆధారంగా పనులు చేపడితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ నాగం జయసుధ, ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి, ఎంపీడీఓ సునీత, తహసీల్దార్‌ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడమే గొప్పవరం

ప్రజల చేత ఎన్నుకోబడి ప్రజలకు సేవ చేయడం గొప్పవరమని ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. ఆదివారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు నిర్వహించిన వీడ్కోలు ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికై సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని అన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు జీవితంలో ఉన్నతమైన పదవులు పొంది ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డిలతో పాటు ఎంపీటీసీలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పన్నాల రమమల్లారెడ్డి, వేల్పుల నరేష్‌, తండు రేణుక, చురుకంటి జానకమ్మ, బత్తుల యాదమ్మ, గుగులోతు సజ్జనాయక్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ నాగం జయసుధ, ఎంపీడీఓ సునీత, తహసీల్దార్‌ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

మద్దిరాల : అంకితభావంతో పనిచేసిన నాయకులకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవి కాలం ముగియనుండడంతో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలుమల్ల యాదవ్‌, నూకల జగన్‌రెడ్డి, పచ్చిపాల వెంకన్న, మాన్‌సింగ్‌, ఎల్లు అశోక్‌రెడ్డి, పశుల అశోక్‌, మోడెం వెంకన్న, వైస్‌ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, ఎంపీడీఓ మార్గం సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీలు మార్త అనిత కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తుంగతుర్తి : మండల పరిధిలోని బండరామారం గ్రామానికి చెందిన ఆకారపు రమేష్‌ కుమారుడు ఆకారపు సుదర్శన్‌ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్‌ ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌, రమేష్‌, సైదులు, పాడేటి యాదగిరి, ఆకారపు రాములు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకూ వర్తింపజేయాలి

ఆత్మకూర్‌(ఎస్‌) : రైతులతోపాటు కౌలు రైతులకు కూడా రైతుభరోసా వర్తింపజేయాలని పీఏసీఎస్‌ చైర్మన్‌ కొణతం సత్యనారాయణరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండల పరిధిలోని నెమ్మికల్‌ సహకార సంఘం కార్యాలయంలో 'పీఏసీఎస్‌ ఏపూర్‌ శాఖ' ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసాపై రైతుల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కొణతం సత్యనారాయణ రెడ్డి మాట్లాడారు. సాగు చేయని, ఓపెన్‌ ప్లాట్లకు రైతుబంధు తొలగించాలని, 10 ఎకరాల లోపు రైతులందరికీ రైతుబంధు వర్తింపజేయాలన్నారు. దీనికి రైతులందరు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్‌ గజవెల్లి శ్రీనివాస్‌, ఏఓ దివ్య, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ అశోక్‌ కుమార్‌, సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌ రామచంద్రయ్య, సీఈఓ పట్నం లక్ష్మారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహకార సంఘం డైరెక్టర్లు, మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాలకు రైతుభరోసా అమలు చేయాలి

నూతనకల్‌ : పది ఎకరాల భూమి కలిగి సాగు చేస్తున్న రైతులందరికీ రైతు భరోసా అందించాలని పీఏసీఎస్‌ చైర్మన్‌ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా పథకంపై మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఆదివారం రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్‌, డిప్యూటీ రిజిస్ట్రార్‌ గజవెల్లి శ్రీనివాస్‌, ఏఆర్‌ అశోక్‌ కుమార్‌, ఇన్‌స్పెక్టర్‌ రామచంద్రయ్య, సీఈఓ సమ్మెట వెంకన్న, సహకార సంఘం డైరెక్టర్లు ఏలేటి నారాయణరెడ్డి, పసుల వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

అర్వపల్లి : ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసాపై సోమవారం అర్వపల్లి, తిమ్మాపురం పీఏసీఎస్‌ కార్యాలయాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఆయా సంఘాల చైర్మన్‌లు కుంట్ల సురేందర్‌రెడ్డి, మారిపెద్ది మంగమ్మ, సీఈఓలు మేడెబోయిన రామస్వామి, ఊర సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ కార్యక్రమానికి హాజరై అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.


ఆత్మకూర్‌(ఎస్‌) : మాట్లాడుతున్న పీఏసీఎస్‌ చైర్మన్‌ సత్యనారాయణరెడ్డి


నూతనకల్‌ : మాట్లాడుతున్న పీఏసీఎస్‌ చైర్‌పర్సన్‌ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి

ఏఎస్‌ఐ నాగేశ్వరరావుకు సన్మానం

మునగాల : మండల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన టి.నాగేశ్వరరావును ఆదివారం పలువురు స్థానికంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. నాగేశ్వరరావు పోలీసుశాఖలో 34సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలు అందించి సహ సిబ్బందితో పాటు ప్రజల మన్ననలు పొందాడని కొనియాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన నాగేశ్వరరావు దంపతులను సీఐ రామకృష్ణారెడ్డి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మునగాల, నడిగూడెం ఎస్‌ఐలు బైరెడ్డి అంజిరెడ్డి, అజయ్‌కుమార్‌, ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాసరెడ్డి, మల్సూర్‌, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం


మురుగునీరు వెళ్లడానికి తవ్విన కాలువ

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్‌లో ఎమ్మెల్యే సామేల్‌ చొరవతో మురుగు నీటి సమస్యకు పరిష్కారం లభించింది. అంబేద్కర్‌ విగ్రహం సమీపం నుంచి ముత్యాలమ్మ ఆలయం రోడ్డు మీదుగా చెరువు వరకు మురుగు నీరు వెళ్లడానికి తాత్కాలికంగా జేసీబీతో కాలువ తవ్వించారు. దీంతో మురుగు నీరు సాఫీగా వెళ్తోంది. దీంతో గ్రామ ప్రజలు కొన్నేళ్లుగా పడుతున్న ఇబ్బందులు తీరాయి. అంబేద్కర్‌ విగ్రహం సమీపంలో కాలువలో సిమెంట్‌ గూనలు వేయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్‌ అధ్యక్షుడు బొల్లం లింగరాజు, నల్లగుంట్ల రవి, వేముల రమేష్‌, కూరాకుల యుగంధర్‌, మాచర్ల మల్లయ్య, అజీం, శ్రీనివాస్‌, శ్రీరాములు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లిలో డ్రెయినేజీలు నిర్మించాలని బీజేపీ మండల నాయకుడు బొడ్డు వీరేందర్‌యాదవ్‌ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో ఇటీవల పలు వీధులనందు కొత్తగా సీసీ రోడ్లు నిర్మించారని తెలిపారు. ఈ రోడ్ల వెంట మురుగు కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు రోడ్లపైకి చేరి పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోందని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సీసీ రోడ్ల వెంట కాలువలు నిర్మించాలని అధికారులకు విజ్ఞప్తిచేశారు.

• గుంతల రోడ్లు.. నిలుస్తున్న నీళ్లు


నీటితో నిండిన బొల్లంపల్లి రోడ్డు


బురదమయమైన వేల్పుచర్ల రోడ్డు


కొత్తగూడెం రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు


అర్వపల్లి గ్రామపంచాయతీ సమీపంలో..

అర్వపల్లి : రెండు రోజులుగా పడుతున్న చిరు జల్లులతో గ్రామాల్లోని వీధులతోపాటు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. పలు గ్రామాల్లో వీధులు అధ్వానంగా తయారయ్యాయి. వీధుల్లో వర్షపు నీరు నిలిచి జలమయం అవుతున్నాయి. కాసర్లపహాడ్‌, తిమ్మాపురం, కొత్తగూడెం, వేల్పుచర్ల, అడివెంల, బొల్లంపల్లి తదితర గ్రామాల రోడ్లు ధ్వంసమవుతున్నాయి. వీధుల్లో వర్షపు నీరు చేరి పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. గుంతలమయమైన బీటీ రోడ్లను మరమ్మతు చేయించాలని, వీధుల్లో మురుగునీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

అర్వపల్లి : బొల్లంపల్లిలో విశాలక్ష్మి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు. వేడుకలకు గ్రామస్తులు తగు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం అఖండ దీపారాధన, గణపతిపూజ, పుణ్యాహవాచకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం జరుగనున్నాయి. బలిహరణ, పూర్ణాహుతి కార్యక్రమాలతో వార్షికోత్సవం పూర్తవుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుందాం

కోదాడరూరల్‌ : కమ్మ కులస్తులందరం సమన్వయంతో ఉంటూ సమస్యలను పరిష్కరించుకుందామని కమ్మ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డు రవీందర్‌రావు, జీవీఎస్‌కే ప్రసాద్‌, కోశాధికారి కండెపు రత్నాకర్‌రావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని సంఘం కల్యాణ మండపంలో నిర్వహించిన కోదాడ కాకతీయ సేవా సమితి వార్షిక సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కల్యాణ మండప నిర్మాణ స్థితిగతులు, కల్యాణ మండపంలో ఏర్పాటు చేయాల్సిన మహాదాతల పేర్లు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై తీర్మానాలు చేసి ఆమోదించారు. అనంతరం కాకతీయ సేవా సమితి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెదనాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వేమూరి సురేష్‌, కోశాధికారిగా పోటు రంగారావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రావెళ్ల సీతారామయ్య, మార్తి మాధవరావు, కనగాల నాగేశ్వరరావు, అనంత రాములు, వీరేపల్లి నాగేంద్రప్రసాద్‌, రాంబాబు, శ్రీనివాసరావు, సుబ్బారావు, భ్రమరాంభ, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంలో పలువురి చేరిక

మోతె : మండల కేంద్రానికి చెందిన ఎల్లబోయిన రామ్మోహన్‌, మొగిలి ఉపేందర్‌ ఆయా పార్టీలకు రాజీనామా చేసి ఆదివారం సీపీఎంలో చేరారు. స్థానికంగా వారికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాపోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం శుభసూచికమన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాడేది కేవలం సీపీఎం అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ములుకూరు గోపాల్‌రెడ్డి, కొక్కిరేణి సత్యనారాయణ, కిన్నెర పోతయ్య, దోసపాటి శ్రీనివాస్‌, జంపాల స్వరాజ్యం, పద్మ పాల్గొన్నారు.